మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికడతాం



విక్రయదారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికట్టి రైతులకు అండగా ఉంటామని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. పాలకవర్గంతో కలిసి ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం పరిశీలించారు. మార్కెట్ మొత్తం తిరుగుతూ రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు, వినియోగదారులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చూస్తామని అలాగే వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి యూనియన్ బిల్డింగ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు, హమాలీలు మార్కెట్ ఉద్యోగులతో కలిసి పాలకవర్గం సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, మార్కెట్ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, మశ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, నరసింహ, గణేశ్ నాయక్, నరసింహ, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, వెంకట్ గుప్తా, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఎన్టీఆర్‌నగర్ మార్కెట్ కార్యదర్శి ఎండీ.వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పర్వతాలు

నాగోలు: కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల్ సమితి అధ్యక్షుడు బోయపల్లి రాములుగౌడ్ అధ్యక్షతన ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు చౌరస్తాలోని ఆటో కార్మికుల స్టాండ్ వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కొందరు ఓన్ ప్లేట్‌తో టూ వీలర్స్, ఓలా, ఉబర్ నడుపుతూ ఆటో కార్మికుల పొట్ట కొట్టేలా ఉందన్నారు. కొందరు ప్రైవేట్ వెహికల్స్ ఓన్ ప్లేట్‌తో ట్యాక్సీలుగా ఓలా, ఉబర్‌ను ఉపయోగిస్తూ నగరంలో తిప్పుతున్నారని దీని కారణంగా అనేకమంది ఆటో డ్రైవర్లు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే వాటిని నివారించాలని కోరారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ ఆర్టీసీ రంగారెడ్డి జిల్లా, ఆఫీస్ బేరర్ వెంకన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల కార్యదర్శి ఎం మదిలేటి, సక్రు నాయక్, ఆటో కార్మికులు కృష్ణమూర్తి, రాజు , బాల శేఖర్, వెంకటేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతులు



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శివారుకాలనీల ప్రజలు



విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని తూర్పు(శివారు) కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మంగళవారం కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పెండింగ్ డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులకు రెండు విడతలుగా రూ.3.5 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. అయితే మధ్యలో కొంత మేర వ్యవసాయ భూములు ఉండడంతో పనులు నిలిచిపోయాయని, త్వరలో వారిని పిలిచి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుమన్‌గౌడ్, రాఘవేందర్‌రావు, కాలనీలవాసులు మనోజ్‌కుమార్, కృష్ణ, శ్రీశైలం, రమేశ్, రాజు గౌడ్, నర్సిరెడ్డి, లక్ష్మీపతి, యాదిరెడ్డి, రాంబాబు నాయక్, సూర్యానాయక్, శశి తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు..

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతి నిధులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నియోజకవర్గంలో నూతన కాలనీలు పెరుగుతున్నాయని జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీలో రోడ్డు, డ్రైనేజీ, వాటర్ పైపులైన్ సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సత్యంచారి, శ్రీనునాయక్, కాలనీ అధ్యక్షుడు దోర్నాల విజయ్‌భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ యాదవ్, కోశాధికారి రాహుల్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, సెల్‌ఫోన్లు

నాగోలు: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం, పన్నా జిల్లా, అజయ్‌గుడ్, బీరా గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ సోని (45) జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చాడు. ఎన్టీఆర్‌నగర్ సాయిబాబానగర్‌లో నివాసం ఉంటూ మార్బుల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రాజస్థాన్ రాష్ట్రం, కరౌలి జిల్లా, మసల్పూర్, కుందాకు చెందిన హేమ్‌సింగ్ ఆలియస్ హేమంత్ (40) నాగోలు జైపురికాలనీలో నివాసం ఉంటూ మార్బుల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనులు చేసే క్రమంలో గంజాయికి బానిస అయ్యారు. అయితే వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం చేశారు. ఇద్దరు కలిసి నాగోల్‌కు చెందిన సంజు గంజాయి సప్లయర్‌తో పరిచయం పెంచుకున్నారు. అతని వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఎక్కువ ధరకు గంజాయిని విక్రయిస్తున్నారు. ఈ నెల 16 న రాత్రి సమయంలో ఎల్‌బీనగర్‌లోని సిరీస్ రోడ్డులోని డీవీఎం కళాశాల ఎదురుగా ఉన్న సంజు గంజాయి ప్యాకెట్లు తెచ్చి విజయ్‌కుమార్ సోనికి విక్రయించాడు. అక్కడికి వచ్చిన హేమాసింగ్ గంజాయి తీసుకుని వెళ్లి పోయాడు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు విజయ్‌కుమార్ సోని, హేమ్‌సింగ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని వారి నుంచి 539 గ్రాముల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రూ. 2 వేలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తలిరించారు. గంజాయి సరఫరా చేసిన సంజు పరారీలో ఉన్నాడు. అతడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.





మినీపై..మెనీ ప్రాబ్లమ్స్..!

అధ్వానంగా సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్

- చెరువు నీటిలో పేరుకుపోతున్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు
- ఊడిపోయిన ఫెన్సింగ్. పగిలిపోతున్న టైల్స్
- నిర్వహణ లేక నిరుపయోగంగా టాయిలెట్
- నెరవేరని నాటి సీఎం కేసీఆర్ హామీ
- సుందరీకరణకు నోచుకోని వైనం
- ఇబ్బందుల్లో సందర్శకులు, స్థానికులు

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై సమస్యలు తిష్ఠ వేశాయి. ఓవైపు లేచిపోయిన ఫ్లోరింగ్, చెరువుకు కొంతభాగం ఫెన్సింగ్ లేకపోవడంతో పాటు పరిసరాలు అధ్వానంగా మారాయి. మరోవైపు పచ్చదనం లేక కళావిహీనంగా మారి సందర్శకుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. కట్టపై ఏర్పాటు చేసిన టాయిలెట్ నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ఇంకోవైపు చెరువు నీటిలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, చెట్ల కొమ్మలు పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో సందర్శకులు ఎక్కువసేపు అక్కడ ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి.

నాటి హామీల అమలేది..?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత నాటి సీఎం కేసీఆర్ సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌ను సందర్శించి పర్యాటక కేంద్రంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం కొన్ని రోజులకు మురుగునీరు, వ్యర్థాలకు నెలవుగా ఉన్న చెరువుకట్టను సుందరంగా తీర్చిదిద్దేందుకు తాను దత్తత తీసుకుంటున్నట్లు అప్పటి రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ ప్రకటించారు. దీంతో మినీ ట్యాంక్‌బండ్‌కు మహర్దశ పడుతుందని స్థానికులు భావించారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మినీట్యాంక్ అభివృద్ధి కలగానే మిగిలింది.

99 ఎకరాల్లో చెరువు..

1906లో అప్పటి నైజాం తాగునీరు, వ్యవసాయ అవసరాల కోసం 99 ఎకరాల్లో చెరువును తవ్వించారు. ఇటలీ నుంచి పక్షులు కూడా సరూర్‌నగర్ చెరువును విడిదికి స్థావరంగా చేసుకునేవి. అయితే రోజురోజుకు నగరం అభివృద్ధి చెందుతుండడంతో చెరువు చుట్టూ ఆక్రమణలకు గురి కావడంతో ప్రస్తుతం చెరువు 60 ఎకరాలకే పరిమితం అయింది.



నిర్వహణ లేక నిరుపయోగంగా టాయిలెట్స్

మురికి కూపంలా చెరువు..

పాత సరూర్‌నగర్ మండలంలోని గ్రామాలు, చెరువుల నుంచి మురుగునీరు పెద్ద ఎత్తున సరూర్‌నగర్ చెరువులో కలుస్తుండడంతో మురికి కూపంలా మారింది. దీనికితోడు పరిసర కాలనీల ప్రజలు వ్యర్థాలను అందులోనే వేస్తుండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది.

పనిచేయని సివరేజ్ ప్లాంట్..

2003లో స్థానికుల ఆందోళనతో రూ.3 కోట్లతో సివరేజ్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే అది సక్రమంగా పనిచేయకపోవడంతో చెరువు మురుగునీటితో నిండిపోయింది. చెరువు అభివృద్ధిలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని పార్కును ఏర్పాటు చేసి బోటింగ్ సౌకర్యం కల్పించారు. కొద్ది రోజులకే నీరంతా మురుగుగా మారడంతో బోటింగ్‌కు ఆదరణ లేకుండా పోయింది. ట్రీట్‌మెంట్ ప్లాంట్ పని చేయకపోవడంతో చెరువులోకి మురుగు నీరు వచ్చి చేరి దుర్వాసన వస్తున్నది. దీంతో మినీ ట్యాంక్‌బండ్‌కు సందర్శకుల సంఖ్య కూడా తగ్గింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

విగ్రహాలు ధ్వంసం చేస్తే ఎన్‌కౌంటర్ చేయాలి

చంచల్‌గూడ: విగ్రహాలను ధ్వంసం చేసేవారిని ఎన్‌కౌంటర్ చేయాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న నగరాన్ని పని కట్టుకుని విగ్రహాల ధ్వంసం చేసి మతకలహాలకు తావిస్తున్నారని మండిపడ్డారు. విగ్రహాల ధ్వంసం చేసే వారికి ఖచ్చితంగా ఉగ్రవాదసంస్థలు, ఉగ్రవాద ప్రేరేపిత సంస్థలతో సంబంధం ఉంటుందని పేర్కొన్నారు.

ఉద్యోగుల డీఏ వెంటనే విడుదల చేయాలి

వనస్థలిపురం: ఉద్యోగులకు వెంటనే ఐదు డీఏలు విడుదల చేయాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.దాసరి అజయ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా డీఏలు విడుదల చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలన్నీ ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని, వారికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మ్యాన్‌హోల్ మరమ్మతును పరిశీలిస్తున్న కార్పొరేటర్

లింగోజిగూడ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని నేతజీనగర్ దసరా గుడి వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన జలమండలి అధికారులతో కలిసి మ్యాన్‌హోల్‌కు శుక్రవారం మరమ్మతులు చేయించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నాగోలు: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నాగోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్కాపురి చౌరస్తా స్వాగత్ గ్రాండ్ హోటల్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (50) కింద పడి మృతి చెందాడు. స్థానికులు గమనించి నాగోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి మృతి చెందిన వ్యక్తిని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు.

విద్యార్థుల సమస్యలు విస్మరించిన ప్రభుత్వం



దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

మలక్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను విస్మరించిందని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరేళ్ల మహేశ్ కుమార్ అన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.4500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే మెస్ చార్జీలు పెంచి పెండింగ్ వాటిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు ఎలిజబెత్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి యోగేష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లారెడ్డి స్కూల్‌లో 'సైన్స్ ఎక్స్‌పో-2024' షురూ



సైన్స్ ఎక్స్‌పోలో ఎగ్జిబిట్స్ పరిశీలిస్తున్న సైంటిస్టులు

చైతన్యపురి: భారత్ ప్రైడ్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డి స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో-2024 శుక్రవారం ప్రారంభమైంది. ఐఎండీ సైంటిస్ట్ డాక్టర్ నాగరత్న, సీఎస్ఆర్ఐ సైంటిస్టులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ అనంతప్రసాద్‌వారి ముఖ్యఅతిథులుగా హాజరై పలు ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతోగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సాయిచైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్ సీహెచ్ సురేశ్‌బాబు, భారత్ ప్రైడ్ చైర్మన్ నరేంద్రశర్మ, జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



నాగోలు: తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులైన రిటైర్డ్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను రంగారెడ్డి జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేశ్ గౌడ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమగాని మహేశ్ గౌడ్, పోలే సురేశ్ పాల్గొన్నారు.

భర్త, అత్తమామల వేధింపులు భరించలేక..

ఉరేసుకుని గృహిణి ఆత్మహత్య



నాగమణి (ఫైల్)

నాగోలు: భర్త, అత్తమామల వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన నాగమణి (28)కి సూర్యాపేట జిల్లా దంతపల్లి మండలం వేములపల్లికి చెందిన సంపత్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో సంపత్‌కు కట్న కానుకల కింద 8 తులాల బంగారం, ఎకరం భూమి ఇచ్చారు. సంపత్ కొన్ని రోజుల క్రితం భార్య నాగమణితో కలిసి ఎల్‌బీనగర్ మన్సూరాబాద్ మధురనగర్ కాలనీలో కిరాయి ఉంటున్నాడు. సంపత్ ఎల్‌బీనగర్ ప్రాంతంలో కార్ల షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. అయితే వీరికి పిల్లలు లేకపోవడంతో భర్త, అత్తమామల వేధింపులు ప్రారంభమయ్యాయి. దీనికితోడు సంపత్ సోదరిమణులు కూడా నాగమణిని పిల్లలు కాలేదని నానా మాటలతో ఇబ్బందులు పెట్టేవారు. అంతేగాకుండా నువ్వు వెళ్లిపోతే సంపత్‌కు మరో పెళ్లి చేస్తామని తరుచుగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో దసరా పండుగకు సంపత్ కుటుంబ సభ్యులు అతని ఇంటి వచ్చారు. అందరూ కలిసి నాగమణిని సూటి పోటి మాటలతో వేధింపులకు గురి చేశారు. దీంతో మనస్థాపం చెందిన నాగమణి అందరూ వెళ్లిన తర్వాత గురువారం రాత్రి సమయంలో తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన ఇంటి యజమాని ఎల్‌బీనగర్ పోలీసులు, నాగమణి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవా ఖానకు తరలించారు. నాగమణి సోదరుడు సమ్మయ్య శుక్రవారం ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు నాగమణి భర్త సంపత్, అతని కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలి

నాగోలు: మన్సూరాబాద్ పరిధిలోని డంపింగ్ యార్డు వద్ద ఉన్న పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఫారెస్ట్ ప్రధాన కార్యాలయంలో పీసీసీఎఫ్ రాకేశ్ మోహన్ డోబ్రియల్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అటవీ శాఖ స్థలం అధికంగా ఉందని రోడ్డు వేసేందుకు అనుమతులు నిరాకరించారని, ప్రస్తుతం అధికారులు సర్వే చేయగా కేవలం 200 మీటర్ల కంటే తక్కువ స్థలం ఫారెస్ట్ అధీనంలో ఉన్నట్లు గుర్తించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, రవి ముదిరాజ్, అశోకప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పంజేషా హాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల 28 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.11.22 లక్షల ఆర్థిక సాయం మంజూరు అయ్యిందని తెలిపారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ఉన్నారు.

నియామక పత్రం అందజేత



ప్రశాంత్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న జితేందర్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన కుకుడాల ప్రశాంత్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ సేవాదళ్ తెలంగాణ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ప్రశాంత్‌రెడ్డికి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సేవాదళ్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

వ్యవసాయ మార్కెట్‌లో స్పెషల్ డ్రైవ్



మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో చెత్తను తరలిస్తున్న సిబ్బంది

చాదర్‌ఘాట్: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో వారం రోజుల పాటు చెత్తకుప్పల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-1 అధికారి చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉల్లిగడ్డల సీజన్ నేపథ్యంలో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో సంబంధిత కాంట్రాక్టర్‌తో చెత్తను తొలగిస్తున్నామన్నారు. అదేవిధంగా మార్కెట్‌లో దుకాణదారులు కూడా చెత్తను డ్రైనేజీలో వేయకుండా చెత్తకుండీల్లో వేయాలని కోరారు. గ్రేడ్-3 అధికారి పుష్ప, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంత నిర్మాణానికి ఉచిత సేవలు



జలమండలి డీజీఎం సయ్యద్ హస్మత్ అలీ

చాదర్‌ఘాట్: ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకునేవారికి జలమండలి తరఫున ఉచితంగా సాంకేతిక సిబ్బంది సేవలు అందిస్తారని మలక్‌పేట జలమండలి డివిజన్-1 డీజీఎం సయ్యద్ హస్మత్‌అలీ తెలిపారు. మలక్‌పేట జలమండలి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే తమ పరిధిలో 300 గజాల పైన నివాసాల్లో ఇంకుడు గుంతలు లేని వాటిని గుర్తించామని తెలిపారు. వారికి అవగాహన కల్పించడంతో పాటు నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎవరైనా తమ ఇళ్లలో ఇంకుడు గుంత నిర్మించాలనుకుంటే జలమండలి గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించాలని సూచించారు.



ఆకట్టుకుంటున్న కళాకృతులు..!

ఎల్‌బీనగర్: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అక్కడి విశిష్టత తెలిసేలా గోడలపై ఏర్పాటు చేస్తున్న కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. ఎల్‌బీనగర్‌లోని ఇప్పటికే ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల్లో వివిధ కళాకృతులు ఏర్పాటు చేసింది. అలాగే ఆటోనగర్‌లోని పర్యాటక ప్రాంతమైన హరిణ వనస్థలి పార్కు గోడలపై వివిధ రకాల జంతువుల బొమ్మలు, ప్రకృతి సోయగాలను అందంగా తీర్చిదిద్దారు. పక్కనే ఉన్న వ్యవసాయ సెంటర్ అయిన క్రీడా గోడలపై కూడా వివిధ పంటల కళాకృతులను వేయించారు. వీటికోసం సుమారు.రూ.20 లక్షలు ఖర్చు అయినట్లు అధికారులు తెలిపారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365